ప్రజారోగ్యంతో చెలగాటం

- రోడ్లపైనే విచ్చలవిడిగా మాంసం విక్రయాలు
- ఏడాదిలోపు జీవాలను వధిస్తున్నారంటూ ప్రజల ఆందోళన
- మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు



మార్కెట్ వద్ద ట్రాఫిక్ ఇలా..

రాయదుర్గం: ఆహార పదార్థాలు ఎన్ని ఉన్నా.. మాంసం ప్రియులకు ప్రతి ఆది, మంగళ, శుక్రవారం ముద్దలోకి ముక్క ఉండాల్సిందే. కొందరైతే వారంతో పనిలేకుండా చికెన్‌గానీ, మటన్‌గానీ లాగించేందుకు ఉవ్విళ్లూరుతుంటారు. అయితే కొనే మాంసం నాణ్యమైనదేనా..? శుభ్రంగా ఉందా? లేదా అని చూసుకోవడంలేదు. పండగలు, ఫంక్షన్లు, సెలవు రోజుల్లో కొనుగోలు చేస్తున్న మాంసం నాణ్యతగా ఉందా? అని చూసుకోవడంలేదు. మాంసం వ్యాపారులు కూడా నిబంధనలకు పాతరేస్తున్నారు. జంతువధశాల (స్లాటర్‌హౌజ్) సక్రమంగా నిర్వహించకపోవడం విమర్శలకు తావిస్తోంది. వధించే మేకలు, గొర్రెలు ఆరోగ్యంగా ఉన్నాయా? రోగాలతో ఉన్నాయా అని పరీక్షించే పశువైద్యాధికారులు, పర్యవేక్షించాల్సిన పురపాలిక శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పట్టించుకోవడంలేదు.

పశువైద్యులు ధ్రువీకరించాల్సి ఉంది..

నిబంధనల ప్రకారం జంతువధ శాలల్లో గొర్రెలు, మేకలను అక్కడ పశువైద్యులు పరీక్షించి ధ్రువీకరణ (ముద్ర) పొందాలి. ఆ మాంసాన్ని ఒక రోజు వ్యవధిలోనే విక్రయించాలి. కానీ పురపాలికల్లో వధ శాలలు లేక, తనిఖీలు నిర్వహించక వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు వ్యాపారులు నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. మిగిలిన మాంసాన్ని ఫ్రిజ్‌లలో పెట్టి..ఆ తర్వాత రోజు విక్రయిస్తున్నారు. అనారోగ్యం పాలైన వాటిని తక్కువ ధరకు తీసుకొచ్చి వినియోగదారులకు అంటగడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

నాణ్యత లేని మాంసం విక్రయాలపై ఫిర్యాదు..

రాయదుర్గంలో నాణ్యత లేని మాంసం విక్రయిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దుకాణాల చుట్టూ అపరిశుభ్రత ఉంటోంది. మాంసంపై ఈగలు, దోమలు వాలి ఉంటాయని పలువురు వాపోయారు. ఏడాది లోపు పిల్లలు(జీవాలను) వధిస్తూ, ఆ మాంసాన్ని ప్రజలకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో ఎక్కడబడితే అక్కడ మాంసం విక్రయాలు చేపట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు.దీనికి తోడు తుకాల్లోనూ కొందరు మోసాలకు పాల్పడుతున్నారని వాపోయారు. ఈ విషయంపై రాతపూర్వకంగా స్థానిక మున్సిపల్ కమిషనర్కు ఫిర్యాదు చేసినట్లు పట్టణానికి చెందిన పలువురు తెలిపారు.



మాంసంపై ముసురుకుంటున్న ఈగలు

అపరిశుభ్రతతో అవస్థలు పడుతున్నాం

రాయదుర్గం మటన్ మార్కెట్ చుట్టూ అపరిశుభ్రత వాతావరణం కనిపిస్తోంది. ప్రధాన రోడ్డే వధ శాలగా మారింది. మాంసంపై ఈగలు ముసురుతున్నా పట్టించుకోవడం లేదు. కొందరైతే తూకాల్లోనూ మోసాలు చేస్తున్నారు. అధికారులు పరిశీలించి, ప్రజలకు నాణ్యమైన మటన్, చికెన్ అందేలా చర్యలు చేపట్టాలి. ఈ విషయంపై స్థానికులంతా అధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశాం.

– వాల్మీకి పవన్, రాయదుర్గం

చర్యలు తీసుకుంటాం

ప్రజలకు నాణ్యమైన మాంసం అందించేందుకు చర్యలు తీసుకుంటాం. జంతు వధ శాలలో విక్రయాలు జరిపేలా ఆదేశిస్తాం. నాణ్యతలేని మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతాం. శానిటరీ అధికారులతో తనిఖీలు నిర్వహిస్తాం. ఎక్కడబడితే అక్కడ విక్రయాలు జరపకుండా కఠిన చర్యలు చేపడతాం.

– కిశోర్, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

క్లుప్తంగా

టెంకాయల వేలం ప్రశాంతం



టెంకాయల వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: నేమకల్లు గ్రామంలో ప్రముఖ ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం ప్రశాంతంగా టెంకాయల వేలం సాగింది. దేవదాయశాఖ ఉరవకొండ ఇన్‌స్పెక్టర్ రాణీ, ఈఓ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో టెంకాయల వేలం పాట నిర్వహించారు. ఏడుగురు వేలంపాటలో పాల్గొన్నారు. గాలి బసప్ప అనే వ్యక్తి రూ.6.22 లక్షలు టెంకాయల విక్రయ హక్కు దక్కించుకున్నాడు. గతేడాది రూ.6.20 లక్షలకు పోగా ఈ ఏడాది అదనంగా రూ. 2 వేలు ఆదాయం వచ్చినట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనర్ కిశోర్ తదితరులు

రాయదుర్గంటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిశోర్ తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా పరిష్కార వేదికలో నాలుగు అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. కేబీ ప్యాలెస్ రోడ్డులోని మటన్ మార్కెట్ వద్ద అపరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలని శంకరప్ప ఫిర్యాదు చేయగా, ఇంటి స్థలం విషయమై పరిష్కారం చూపాలని వేణుగోపాల్ గుప్తా, జంతువధ శాల సుంకం చెల్లించడం లేదని పవన్, బీటీపీ రోడ్డులో పైప్‌లైన్ బ్లాక్ అయిందని వేణుగోపాల్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జయచంద్ర పాల్గొన్నారు.

కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీడీ శైలజ

కూడేరు: జాబ్ కార్డు ఉన్న కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఏపీడీ శైలజ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కూడేరులో ఆమె ఉపాధిహామీ మండల సిబ్బందితో సమావేశమయ్యారు. పనులు కల్పించలేదని కూలీల నుంచి ఫిర్యాలు వస్తే అందుకు బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రోజుకు వెయ్యి మందికిపైనే పని కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ తులసీ ప్రసాద్, ఇంజనీర్ రవి , టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

కుందుర్పి: మండలంలోని కెంచంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కుర్లపల్లి రామప్ప (72) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీలో చురుగ్గా పనిచేయడమేగాక మరోవైపు కళాకారుడిగా కూడా గుర్తింపు పొందాడు. శ్రీకృష్ణుడు, అర్జునుడు, సత్యహ రిశ్చంద్ర తదితర పాత్రలు ధరించి, నియోజకవర్గంలో పలు నాటక ప్రదర్శనల్లో గుర్తింపు తెచ్చుకున్నాడు. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, ఎంపీపీ నాగరాజు, సర్పంచ్ గంగాధర తదితరు లు రామప్ప మృతిదేహానికి నివాళులర్పించారు.

హాకీ క్రీడాకారులకు నైపుణ్య శిక్షణ



స్పెయిన్ హాకీ క్రీడాకారులను సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా,రాష్ట్ర స్థాయికి ఎంపికయిన హాకీ క్రీడాకారులకు స్పెయిన్ దేశస్తులు హాకీ క్రీడాకారులు ఆటలో మెలకువలను నేర్పించారు. పాల్తూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాకీ క్రీడలో మంచి ప్రతిభను కనబరిచి, రాష్ట్ర స్థాయిలో ఎంపికై న క్రీడాకులకు ఆర్డీటీ ప్రత్యేకంగా దత్తత తీసుకొని స్పెయిన్ నుంచి హాకీ క్రీడాకారులను పిలిపించి, నైపుణ్య శిక్షణ, మెలకువలు నేర్పించారు. ప్రధానోపాధ్యాయులు సర్వమంగళం, పీడీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రమేష్, ఎర్రిస్వామి, శ్రీనివాసులు, ప్రకాష్‌రెడ్డి తదితర ఉపాధ్యాయులు కలిసి స్పెయిన్ హాకీ క్రీడాకారులను సత్కరించారు. ఈకార్యక్రమమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణలో వ్యక్తికి తీవ్ర గాయాలు



దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వడ్డే ముత్యాలు

శెట్టూరు: మండలంలోని లక్ష్మంపల్లిలో స్థల వివాదంలో రెండు వర్గాల మధ్య ఆదివారం రాత్రి ఘర్షణ జరిగింది. ఘర్షణలో వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డే ముత్యాలుపై రామకృష్ణారెడ్డి, అతని కుటుంబ సభ్యులు తీవ్రంగా దాడి చేశారు. దాడిలో ముత్యాలు తలకు, ఒంటిపై బలమైన రక్త గాయాలయ్యాయి. గ్రామస్తులు వెంటనే ముత్యాలును కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ రాంభూపాల్ ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాధితుడిని పరామర్శించిన మాజీ ఎంపీ..

అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ముత్యాలును అనంతపురం మాజీ ఎంపీ తలారి రంగయ్య సోమవారం పరామర్శించారు. తీవ్రంగా దాడి చేయడం హేయమన్నారు. చట్టప్రకారం సమస్య పరిష్కరించుకోవాలి తప్ప దాడులు చేయడం సరికాదన్నారు. బాధితుడికి అండగా ఉంటామన్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివన్నయాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్



ఉరవకొండలోని నింబగల్లు ఎస్ఎస్ ట్యాంకులను పరిశీలిస్తున్న మంత్రి కేశవ్

ఉరవకొండ/వజ్రకరూరు: ఉరవకొండలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. సోమవారం నింబగల్లులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకును మంత్రి పరిశీలించారు. గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ హేసాన్‌బాషా, డీఈ అంజుమన్ సర్వీన్, జేఈ ఫామీదాలతో కలిసి మంత్రి ఉరవకొండ సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు. అనంతరం హెచ్చెల్సీ నుంచి ట్యాంకుల్లో కొనసాగుతున్న నీటి పంపింగ్ ప్రక్రియను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన కొనకొండ్ల సత్య సాయి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును మంత్రి పరిశీలించారు. ప్రస్తుతం ఫిల్టర్ బెడ్ల పనితీరు, రిజర్వాయర్‌లో ఉన్న ప్రస్తుత నీటినిల్వ,ఇన్ కమింగ్, అవుట్ గోయింగ్, ప్రజావసరాలకు కావాల్సిన నీటి నిల్వ, ట్యాంకుకు ఎక్కడి నుంచి నీటి పంపింగ్ జరుగుతుందోన్న విషయాలపై అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్‌లో మైక్రో ఫిల్టర్‌బెడ్ల ఏర్పాటుకు, హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి నీటి పంపింగ్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. కొనకొండ్ల ఎస్ఎస్ ట్యాంకు ట్యాంకు పరిధిలోని 14 గ్రామాలకు రోజు తాగునీటి సరఫరా కోసం ప్రణాళికలపై అధికారులతో మంత్రి చర్చించారు. అనంతరం సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు మంత్రిని కలిసి వేతనాల విషయమై వినతిపత్రం అందించారు. సైట్ ఇంజనీర్లు బాలుయాదవ్ తదితరులు పాల్గొన్నారు. కొనకొండ్ల ఎస్ఎస్ ట్యాంకులను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు.

ఎస్సీ హాస్టల్ స్థలంలో కల్యాణమంటపం నిర్మించండి

ఉరవకొండ: ఉరవకొండ పోలీసు స్టేషన్ పక్కనే ఉన్న ఎస్సీ హాస్టల్ స్థలంలో కళ్యాణమంటపం నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి కొకుంట్ల రవి, సీనియర్ నాయకులు చెన్నకేశవులు, రాంపురం చెన్నప్ప, కొకుంట్ల సురేష్, రాయంపల్లి వెంకటేష్ తదితరులు మంత్రి పయ్యావుల కేశవ్‌కు విన్నవించారు.

మండల సర్వసభ్య సమావేశం మమా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం: డీ హీరేహాళ్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎం. పవిత్ర అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్వసభ్య సమావేశం ప్రధాన అంశాలపైన, సమస్యలపైన చర్చించాల్సి ఉండగా, తూతూమంత్రంగా ప్రారంభించి, ముగించారు. కాగా సమావేశం ప్రారంభం కాగానే ఆయా శాఖల అధికారులు మాట్లాడారు. మధ్యలో వేదికపైకి వచ్చిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముందుగా ప్రసంగించారు. ఆ తర్వాత పక్కనే ఉన్న గదిలోకి వెళ్లారు. అక్కడ కార్యకర్తలతో మాట్లాడారు. దీంతో సభ సాగలేదు. సభ్యులతో సంతకాలు మాత్రమే తీసుకొని మమా అనిపించేశారు. వేదికమీదున్న అధ్యక్షురాలు, జెడ్పీటీసీ హసీనా బాను, వైస్ ఎంపీపీ లింగన్న మాట్లాడకుండానే సభ ముగించడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై సమావేశం నిర్వహించాల్సి ఉండగా, అవేవీ సమావేశంలో చర్చించకపోవడంపై విమర్శలు వచ్చాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం. వన్నూర్‌స్వామి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ, అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుకు శ్రీకారం

బొమ్మనహాళ్: నేమకల్లు గ్రామం నుంచి రియా ఆగ్రో ఇండస్ట్రీ కంపెనీ, ఉద్యానశాఖ అధికారులు ఆయిల్ ఫాం సాగుకు శ్రీకారం చుట్టారు. మండలంలోని నేమకల్లులో సోమవారం రియా ఆగ్రో కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ ఫాం మొక్కలను గ్రామానికి చెందిన ముత్తు, ఆంజనేయ రైతు పొలాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమానికి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు , జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహారావు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఆరు మండలాల్లో 300 హెక్టార్లలో ఆయిల్ ఫాం సాగు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్ మండలాల్లో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఉద్యానశాఖ, రియా ఆగ్రో కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మానాయక్, కంపెనీ ప్రతినిధులు రఘువర్మ, సంజయ్ జైన్, రామ్మోహన్‌రావు, ఉద్యానవన అధికారిణి మౌనిక, ఏఓ సాయికుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్‌పోటీలకు గురుకులం విద్యార్థినులు



రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన ఉరవకొండ ఎస్సీ గురుకులం విద్యార్థినులు

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ ఎస్.సునీత, వైస్ ప్రిన్సిపాల్ జయమ్మ, పీడీ అంజలి, లైబ్రేరియన్ కుళ్లాయమ్మ మాట్లాడారు. అనంతపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లోని క్రీడా మైదానంలో జరిగిన సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ జట్ల ఎంపిక నిర్వహించారు. ఇందులో అద్భుత ప్రతిభ చూపి ఉరవకొండ ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థినులు అలేఖ్య, నందిని, అనిత, శైలజ, కీర్తనా, శ్వేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థినులు చిత్తూరు జిల్లా కుప్పంలో ఆగస్టు 10, 11వ తేదీల్లో అంతర్ జిల్లా చాంపియన్ షిప్ పోటీల్లో రాష్ట్రం తరఫున పోటీపడుతారన్నారు. రాష్ట్ర స్థాయి గెలుపొందిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినులు అభినందించారు.

వ్యక్తిపై ఎలుగు బంటి దాడి

బ్రహ్మసముద్రం : మండలంలోని పడమటి కోడిపల్లి గ్రామ సమీపంలో కర్ణాటక సరిహద్దున సోమవారం ఓ పశువుల కాపరిపై ఎలుగు బంటి దాడి చేసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో పలుమార్లు రైతులపై ఎలుగుబంట్లు దాడి చేసిన విషయం తెలిసిందే. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఎలుగు బంట్ల సంచారాన్ని అరికట్టాలని స్థానికులు కోరారు.

కలుషిత ఆహార పదార్థాలతోనే డయేరియా



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆసియా

కంబదూరు: కలుషిత ఆహార పదార్థాలు, తాగునీటితోనే డయేరియా వ్యాప్తిచెందుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యాధికారి ఆసియా తెలిపారు. సోమవారం మండలంలోని జెక్కిరెడ్డిపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 45 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. అనంతరం సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, డయేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధుల నివారణ చర్యలపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది యల్లంరాజు, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

బ్రహ్మసముద్రం : పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఈఓఆర్డీ వెంకట్‌నాయుడు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పరిసరాల పరిశుభ్రత అందరిదీ బాధ్యత అని తెలియజేశారు. అనంతరం ప్రధాన కూడలిలో మురుగు కాలువలను పూడిక తీయించి, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్బరాయుడు , పంచాయతీ కార్యదర్శి మంజుల , స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

బొమ్మనహాళ్: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, మల్లీశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో మలేరియా, డెంగీ, చికున్‌గన్యా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ర్యాలీ చేశారు. వైద్యులు మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్‌గన్యా లాంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, జైనాబీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులకు సోమవారం రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషన పవన్ కుమార్ విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సౌభాగ్య లక్ష్మీ, ఉపాధ్యాయులు సత్యవతమ్మ, ఏఎన్ఎంలు నాగమణి, రామలక్ష్మీ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వ్యాపారుల ర్యాలీ



ఉరవకొండలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వ్యాపారులు

ఉరవకొండ: ఉరవకొండలోని భవన నిర్మాణ, గృహోపకరణాల వ్యాపారులు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ చేశారు. సోమవారం స్థానిక క్లాక్‌టవర్ వద్ద నుంచి ఆర్అండ్‌బీ అతిథి గృహం వరకు ర్యాలీ చేశారు. అనంతరం బిల్డింగ్ నీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి, కార్యదర్శి గోపి, కోశాధికారి జయ నరసింహులు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా తాము ఉరవకొండలో వ్యాపారాలు చేస్తూ కుటుంబాలు పోషించుకుంటున్నామన్నారు. గత కొన్ని నెలల నుంచి తమ వ్యాపారాలు దెబ్బ తినే విధంగా రాజస్థాన్‌కు చెందిన మర్వాడీలు ఉరవకొండలో పెద్ద ఎత్తున వ్యాపారాలు నిర్వహిస్తూ, జీవనోపాధిని దెబ్బతీస్తున్నారన్నారు.

మేకలు,గొర్రెలపై కుక్కల దాడి

కుందుర్పి: కోళ్లఫాం వద్ద రోగాలతో మృతిచెందిన కోళ్లను తిన్న కుక్కలు గ్రామాల్లో రైతుల ఇళ్ల వద్ద పెంచుకుంటున్న మేకలు, గొర్రెలను చంపేస్తున్నాయి. కృష్ణాపురంలో గంగమ్మ అనే మహిళకు చెందిన పొట్టేలును పాకలో కట్టేసి ఉంచగా, కుక్కలు దాడి చేసి చంపేశాయి. ఇటీవల కలిగొలిమిలో 23 గొర్రెల పిల్లలు, అప్పాసిపాళ్యంలో 5 మేకలు, మాయదార్లపల్లిలో 8 మేక పిల్లలను కుక్కలు చంపేసిన విషయం తెలిసిందే. గ్రామాల్లో కుక్కలదాడితో ఇబ్బందులు పడుతున్నామని తూముకుంట, కృష్ణాపురం గ్రామస్తులు బాబు,హనుమంతరాయుడు, రాజ్‌కుమార్ తదితరులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఇన్‌చార్జ్ సీడీపీఓగా లక్ష్మీప్రసన్న

కణేకల్లు: కణేకల్లు ఇన్‌చార్జ్ సీడీపీఓగా లక్ష్మీప్రసన్న బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పని చేస్తున్న యల్లమ్మ మెటర్నటీ సెలవుపై వెళ్లడంతో కళ్యాణదుర్గం ప్రాజెక్టులో సీడీపీఓగా పని చేస్తున్న లక్ష్మీప్రసన్నకు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఇన్‌చార్జ్‌గా నియమించారు. దీంతో ఆమె తన ఉద్యోగబాధ్యతలను స్వీకరించారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు సమయ పాలన పాటిస్తూ తమ విధులను నిర్వహించాలని ఆమె సూచించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

బొమ్మనహాళ్: త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీత ప్రచారం చేశారు. కల్లుదేవనహళ్లి గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు , వీరేంద్ర, సుజిత, ఎల్లమ్మ, ప్రవల్లిక, కృష్ణవేణి, చందన, దేవిక పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపైకి మురుగునీరు వదలొద్దు

కుందుర్పి: ప్రధాన రహదారిపైకి మురుగునీరు వదలకుండా గుంతలు తీసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్, సర్పంచు మారుతేశ్వరి తదితరులు తెలియజేశారు. సోమవారం ప్రధాన రహదారి గుండా ఉన్న ఇళ్ల యజమానుల వద్దకు వెళ్లి రోడ్లపైకి మురుగు వదిలితే మంచినీటి కొళాయిలు కట్ చేస్తామని హెచ్చరించారు. ప్రధాన రహదారి గుండా వచ్చే మురుగునీరంతా ప్రభుత్వాస్పత్రి ఆవరణలోకి వెళ్తుండడంతో వైద్య సిబ్బంది రెండు రోజులుగా నిరసనలు తెలియజేయడంతో ఎంపీడీఓ తదితరులు చర్యలు చేపట్టారు.

నేడు వ్యక్తుల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం

కళ్యాణదుర్గం: స్థానిక ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో వ్యక్తుల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సుభాన్ తెలిపారు. ఈ మేరకు జడ్జి సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. సాయంత్రం 5.15 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు.

వీధిలైట్లు మరమ్మతు చేయండి

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో ఉన్న ఎస్సీ కాలనీలో వీధిలైట్లు మరమ్మతు చేయించాలని ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు కమిషనర్ నరసారెడ్డికి సోమవారం విన్నవించారు. కార్యక్రమంలో తాలూకా ఎస్సీ, ఎస్టీ అధ్యక్షులు చెలిమప్ప, జేఏసీ నాయకులు ధన తిమ్మప్ప, మారిన్న, చనమల్లి పాల్గొన్నారు.

ఉత్తర్వుల తర్వాతనే చేపలు పట్టాలి

బెళుగుప్ప: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల తర్వాతనే చేపలు పట్టేందుకు వెళ్లాలని పీఏబీఆర్ మత్స్యక్షేత్రం అభివృద్ధి అధికారి ఎస్ఎస్ లక్ష్మీనారాయణ సోమవారం ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఉత్తర్వుల్లో జీడిపల్లి రిజర్వాయర్ బహిరంగ వేలం తర్వాతనే మత్స్యకారులు చేపలు పట్టాలని ఉందన్నారు. మత్స్యశాఖ అనుమతి లేకుండా చేపలు పడితే చట్టపరమైన చర్యలు తీసుకోబతాయని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజావేదికకు రెండు వినతులు

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు వినతులు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ సురేష్ తెలిపారు. రస్తాలకు సంబంధించిన సమస్యలపై వినతులు రైతులు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో గౌరీదేవి, డీటీ అనిల్, ఈఓ ఆర్డీ సురేష్‌బాబు పాల్గొన్నారు.

గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలి

బెళుగుప్ప: ప్రస్తుతం కురిసే వర్షాలకు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, గొర్రెలు,మేకల కాపరులు అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి రమేష్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామంలో ఉన్నపళంగా మృతి చెందిన 28 గొర్రె పిల్లలకు పోస్టు మార్టం నిర్వహించా రు. పోస్టుమార్టంలో టాక్సీమియా అనే సీజనల్ వ్యాధి తో గొర్రెపిల్లలు మృతి చెందాయని తేలిందన్నారు. ఈ వ్యాధికి సంబంధించిన వైరస్ చిరు జల్లులు కురిసే సమయంలో మట్టిలో వేగంగా వృద్ధి చెందుతుందన్నారు. ఆ మట్టిని గొర్రె, మేకపిల్లలు తింటే ఉన్నట్లుండి మృతిచెందుతాయన్నారు. దుద్దేకుంటలో గొర్రెల కాపర్లు ఎర్రిస్వామి, రమేష్, హనుమంతురాయుడులకు చెందిన 28 గొర్రెపిల్లల మృతితోరూ.80వేల వరకు నష్టం జరిగిందని రైతులు తెలిపారు.

ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలి

బొమ్మనహాళ్: ప్రతి పిల్లవాడూ ఉత్తమ విద్యార్థిగా ఎదగడానికి శిక్షా సప్తాహ్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంఈఓ మల్లికార్జున, సర్పంచ్ కోటేశ్వరరెడ్డి అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ఉద్దేహాళ్, దేవగిరి క్రాస్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమం జిల్లాలో బొమ్మనహాళ్ మండలం ముందుండాలన్నారు.

గోనబావిలో శ్రీరామరెడ్డి తాగునీరు బంద్

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి గ్రామంలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం నీరు అందడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. గత నెల రోజులుగా తాగునీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుమ్మఘట్ట, గోనబావి గ్రామాల మధ్య పైప్‌లైన్ పగిలిపోయి నెల రోజులు కావస్తున్నా పట్టించుకునే వారు లేరని వారు ఏకరువు పెడుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీతను అడగ్గా సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

డీటీకి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు

కూడేరు: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాధ్యతలను కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్‌కు ఉన్నతాధికారులు అప్పగించారు. దీంతో సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల వేళ నంద్యాల జిల్లా నుంచి బదిలీపై వచ్చిన రత్న రాధికకు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ సొంత జిల్లాకు బదిలీ చేయడంతో ఆమె రిలీవ్ అయ్యారు. అందుబాటులో ఉండి ప్రజలకు, రైతులకు ఇబ్బంది లేకుండా కృషి చేస్తానని ఇన్‌చార్జ్ తహసీల్దార్ తెలిపారు.